
ప్రజాశక్తి
మంగళవారం 29 జులై 2025
5
పార్వతీపురం మన్యం



ఏరియా ఆసుపత్రికి రోగుల తాకిడి



ఒపి కౌంటర్ వద్ద ఉన్న రోగులు

సీతంపేట : స్థానిక ఏరియా ఆసుపత్రి కి సోమవారం రోగుల తాకిడి ఎక్కువైంది. 320 ఒపికి ఉండగా, ఇందులో 100 మంది వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. 16 మలేరియా అనుమానితులుగా గుర్తించారు. 37 ఇన్‌పేషెంట్లుగా వైద్య సేవలో పొందుతున్నారని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు

తల్లులకు 'విద్యుత్' షాక్..బిడ్డలకు సర్కారు స్ట్రోక్

- డబ్బులు పడలేదని కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు
- తప్పుడు ఆధార్ సీడింగ్‌తో పేదల అవస్థలు
- భరోసా ఇవ్వలేకపోతున్న అధికారులు

ప్రజాశక్తి - పార్వతీపురం

తల్లికి వందనం పథకం కింద తమ పిల్లలకు డబ్బులు పడలేదంటూ తల్లిదండ్రులు కుప్పలు తెప్పలుగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదులు అందజేస్తున్నారు. గత రెండు నెలలుగా జిల్లాలో తల్లికి వందనం పథకం కింద సాయం అందని పేద, మధ్యతరగతి ప్రజలు సోమవారం జరుగుతున్న గ్రీవెన్స్ సెల్‌కు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. విద్యుత్ బిల్లులు ఎక్కువగా వచ్చాయనే సాకు చూపి అనేక మంది పేదలకు ఈ పథకం కింద నగదు బదిలీ చేయలేదు. కుటుంబంలో ఇద్దరు ముగ్గురు పిల్లలలో ఒక్కరికీ గుర్తించకపోవడంతో వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. సచివాలయాలు, విద్యుత్ కార్యాలయాలు, కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ చేతి చమురు వదిలించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యుత్ బిల్లులు ఎక్కువగా వచ్చాయని చూపించిన

పది విద్యుత్ మీటర్ల లింక్‌తో అందని 'వందనం'

పట్టణానికి చెందిన కనకల మోహన్ రావు, నాగలక్ష్మికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మోహనరావు కూలి పనులు చేస్తున్నారు. ఒక కుమార్తె ఆరో తరగతి, ఇంకో కుమార్తె ఒకటో తరగతి చదువుతున్నారు. వీరిద్దరికీ తల్లికి వందనం పథకం కింద డబ్బులు అందలేదు. మోహనరావు ఆధార్ నెంబర్‌తో పది విద్యుత్ మీటర్లు వున్నాయని, నెలనెలా 685 యూనిట్ల విద్యుత్ వినియోగిస్తున్నారని తల్లికి వందనం పథకం వర్తించలేదని అధికారులు తెలిపారు. నిరుపేద అయిన మోహన్ రావుకు పది విద్యుత్ మీటర్లు ఉన్నాయని చెప్పడంతో ఆయన కుటుంబం షాక్‌కు గురైంది. దీంతో ఆయన విద్యుత్ కార్యాలయానికి వెళ్లి పది విద్యుత్ మీటర్ల డీ సీడింగ్ చేయించారు. కానీ ఆయన పేరిట వున్న 685 యూనిట్లు విద్యుత్ బిల్లు మాత్రం డీ సీడింగ్ కాలేదు. దీంతో ఆయన సచివాలయం, విద్యుత్ కార్యాలయం, కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌కు తిరుగుతున్నారు. అయినా ఏ అధికారీ ఆయనకి స్పష్టమైన హామీ ఇవ్వడం లేదు.

నిడ'గొల్లు' మంటున్న పేదలు

సీతానగరం మండలం నిడగల్లులో వందమందికి పైగా పేదల పిల్లలకు తల్లికి వందనం దూరం చేశారు. అధికారులు, పాఠశాల హెచ్‌ఎం లు ఉద్దేశపూర్వకంగానే గ్రామంలో ఉన్న జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పథకం కింద డబ్బులు అందకుండా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామానికి చెందిన దళితులు, బిసిలు పదుల సంఖ్యలో తల్లికి వందనం పథకం కింద డబ్బులు పడలేదని జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఈ పథకం దూరమవ్వడానికి చూపుతున్న కారణాల్లో ఇది వినూత్న రీతిలో కనిపించింది. ఈ గ్రామ పాఠశాల విద్యార్థులకు పంపిణీ కావాల్సిన డబ్బులు కిల్లో స్వప్న అనే మహిళ ఖాతాలో జమయ్యాయని సంబంధించిన యాప్‌లో చూపించారు. సుమారు వందకు పైగా నిరుపేద విద్యార్థులకు తల్లికి వందనం డబ్బులు ఒక మహిళ బ్యాంక్ ఖాతాలో జమ కావడం చర్చనీయాంశమవుతోంది. దీంతో గ్రామస్తులంతా విస్తుపోతున్నారు. జెడ్పీ హైస్కూల్ ఇన్‌ఛార్జి హెచ్‌ఎంగా పని చేసిన బి.మనోజ్ ఉద్దేశపూర్వకంగా ఇలా జరిగిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. నిడగల్లుకు చెందిన రాయి పిల్లి శ్రీధర్‌కు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమారుడు శ్రీహర్ష ఏడో తరగతి, కుమార్తె శ్రీలత ఎనిమిదో తరగతి చదువుతున్నారు. వీరిద్దరికీ తల్లికి వందనం పథకం కింద డబ్బులు అందలేదు. గత ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి పథకం కింద వీరికి నగదు బదిలీ జరిగింది. శ్రీధర్‌కు చూపినట్లు గానే వందకు పైగా నిరుపేద కుటుంబాలకు తల్లి కి వందనం దూరమయ్యింది. అధికారులు, పాఠశాల హెచ్‌ఎంల నిర్లక్ష్యం కారణంగానే నిడగల్లులోని పేదలకు ఈ పథకం వర్తించలేదని స్పష్టమవుతోంది.



గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధిత తల్లిదండ్రులు

తల్లిదండ్రులు విద్యుత్ ఎఇ కార్యాలయాలకు వెళ్లి సరి చేసుకుంటున్నారు. సరిచేసుకుని సచివాలయాల్లో దరఖాస్తులు అందజేస్తున్నా ఫలితం కనిపించడం లేదు. ఇంతవరకు గ్రీవెన్స్ సెల్‌లో ఈ పథకం కింద లబ్ధి పొందని తల్లిదండ్రులు వందల సంఖ్యలో ఫిర్యాదులు అందజేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్ కి పెద్ద సంఖ్యలో పేద తల్లిదండ్రులు హాజరయ్యారు.

12 జిల్లాల్లో 12 విద్యుత్ మీటర్లు

పట్టణంలోని వివేకానంద కాలనీకి చెందిన సబ్బవరపు శ్రీనివాసరావు, రమాదేవికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. వీరు కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి సొంత ఇల్లు లేదు. అద్దె ఇంట్లో ఉంటున్న వీరికి 12 జిల్లాల్లో 12 విద్యుత్ మీటర్లు ఉన్నాయని ప్రభుత్వం షాక్ ఇచ్చింది. దీంతో వారి ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం పథకం అందలేదు. కుమారుడు అచ్యుత్ 8, కుమార్తెలు దీక్షిత, గీత 6, 3 తరగతులు చదువుతున్నారు. సొంత ఇల్లే లేని తమకు 12 విద్యుత్ మీటర్లు వున్నాయని చూపించి పథకం అమలు చేయకపోవడం అన్యాయమని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తూ, న్యాయం చేయాలని కోరారు.

సాగునీందక రైతుల ధర్నా

- కాలువల్లో పూడికతీత పనులు జరగని వైనం
- పెదంకలాం డిఇని చుట్టుముట్టిన ఆయకట్టు రైతులు

ప్రజాశక్తి - పార్వతీపురం



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు, రైతు సంఘాల నాయకులు

వారం రోజుల క్రితం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పెదంకలాం ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేశారు. సుమారు 12 గ్రామాలకు సంబంధించిన 8వేల ఎకరాల ఆయకట్టుకు ఈ ప్రాజెక్టు ద్వారా నీటిని ఆయన విడుదల చేశారు. అయితే నేటికీ ఆయకట్టు భూములకు దరికి సాగునీరు చేరలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. రెండు, మూడు రోజుల్లో ఉబాలకు వెళ్లాల్సిన తరుణంలో సాగునీరు లేకపోవడంతో రైతులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, రైతు సంఘం నాయకులు గేదెల సత్యనారాయణ, బంటు దాసు, రైతు కూలీ సంఘం నాయకులు ఎం.సింహాద్రి నాయుడు, జనసేన నాయకులు పైల ప్రసాదరావు ఆధ్వర్యాన ఆయకట్టు రైతులు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ పెదంకలాం ప్రాజెక్టు ద్వారా నిర్వహణ లోపభూయిష్టంగా వుండడం, గ్రోయిన్, షట్టర్లు పాడైనా మరమ్మతు, కాలువల్లో పూడికతీత పనులు చేయక పోవడంతో నీరు ఆయకట్టు భూములకు చేరలేదన్నారు. నిధులు ఖర్చు చేసినట్లు అధికారులు చూపుతున్నా పనులు జరగలేదని విమర్శించారు. సింహాద్రి నాయుడు మాట్లాడుతూ ప్రాజెక్టు ఆధునీకరణకు మంజూరైన జైకా నిధులు దుర్వినియోగమయ్యాయని, పనులు జరగకపోవడంతో ఆయకట్టు భూములకు సాగునీరుందే పరిస్థితి లేదని చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. అక్కడే ఉన్న పెదంకలాం ప్రాజెక్టు డిఇ పి.నారాయణను రైతులతో మాట్లాడాలని కలెక్టర్ పంపించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి డిఇ మాట్లాడుతూ ప్రాజెక్టు నుంచి పదమాయవలస వరకు నీరు చేరిందని, మిగిలిన గ్రామాలకు నీరందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు డిఇ చుట్టుముట్టి నిలదీశారు. కాలువల్లో పూడికతీత పనులు చేయకుండా నీరు ఎలా చేరుతుందని రైతులు ప్రశ్నించారు. దీంతో డిఇ నీళ్ల నమిలారు. రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక మౌనం వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతుల ఆందోళనపై నారాయణ మాట్లాడుతూ 2020లో పెదంకలాం ప్రాజెక్టు ఆధునీకరణకు రూ.14 కోట్లు జైకా నిధులు మంజూరయ్యాయని, ఇంతవరకు 5శాతం పనులు జరిగాయని చెప్పారు. నెల్లూరుకు చెందిన ఎస్ఆర్కె కన్ స్ట్రక్షన్స్ కంపెనీ పనులు చేయాల్సి వుందని, బిల్లు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు చేయడం లేదని చెప్పారు. ఆయకట్టు భూములకు సాగునీరందించే ప్రయత్నం చేస్తామని చెప్పారు.

వినతులకు పరిష్కారం చూపాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, అధికారులు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) ద్వారా అందిన అర్జీలపై నాణ్యతతో కూడిన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులకు హితవు పలికారు. సమస్యల పరిష్కారంతో అర్జీదారులకు మేలు జరిగి సంతృప్తి చెందాలని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ అధ్యక్షతన పిజిఆర్ఎస్ కార్యక్రమం సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్. శోబిక, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ కె.హేమలత, కెఆర్ఆర్సీ ప్రత్యేక ఉప కలెక్టర్ డాక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి భాగస్వామ్యమై వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 122 మంది అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించి సమస్యలను విన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను చిత్తశుద్ధితో 48 గంటల్లోగా పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారం నాణ్యత కలిగి ఉండాలని ఉద్బోధించారు. ప్రతి కార్యాలయంలో నోడల్ అధికారి ఉండేలా ఆదేశించామని, ఆ దిశగా అర్జీలు పెండింగ్ లేకుండా చూడాలని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో పలుశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మిషన్ శక్తి - వన్ స్టాప్ సెంటర్ పోస్టరు ఆవిష్కరణ

మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో మిషన్‌శక్తి-వన్‌స్టాప్ సెంటర్ పోస్టరు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెసి ఎస్.ఎస్.శోబిక, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ కె.హేమలత, కెఆర్ఆర్సీ ప్రత్యేక ఉప కలెక్టర్ డాక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, ఐసిడిఎస్ పీడీ డాక్టర్ టి.కనకదుర్గ, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ టి.జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పి కార్యాలయంలో...

పార్వతీపురంటౌన్ : ప్రతి ఒక్క ఫిర్యాదుకు న్యాయం జరిగేలా చూస్తామని పోలీస్ వ్యవస్థ ప్రజలకు చేరువు కావాలని మా లక్ష్యం అని జిల్లా ఎస్పీ ఎస్ వి మాధవరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని ఎస్‌పి నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 8 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో డిసిఆర్బీ ఎస్సై ఫక్రుద్దిన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటిడిఎ గ్రీవెన్స్‌కు 24 వినతులు

సీతంపేట : స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో ప్రాజెక్టు అధికారి సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజలు తమ సమస్యలపై వినతి పత్రాలను సమర్పించారు. మొత్తం 24 మంది వినతి పత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు, ఈఈ కెవిఎస్ఎన్ కుమార్, డిప్యూటీ డిఇ రామ్మోహన్రావు, ఉపాధి హామీ, వెలుగు ఎపిడిలు శ్రీహరిరావు, సన్యాసిరావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయ పార్వతి, పిహెచ్ఒ గణేష్, డిప్యూటీ ఎంపిడిఒ కొండపల్లి సత్యం, ఎఒ వై వాహిణి, సూపరిటెండెంట్ ఎల్.అప్పారావు, స్పోర్ట్స్ నోడల్ అధికారి జాకబ్ దయానంద్, ఎఎంఒ కోటిబాబు, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు..

డిగ్రీ కాలేజీలో ప్రవేశాలు కల్పించాలి

పార్వతీపురం, పాలకొండ, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో పీజీ సెంటర్ ఏర్పాటు చేయాలి
ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - సీతంపేట



సీతంపేటలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు సీతంపేటలో ర్యాలీ నిర్వహించి మానవహారం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షకార్యదర్శులు బి.అనిల్, టి.అఖిల్ మాట్లాడుతూ డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలు కల్పించాలని, పార్వతీపురం, పాలకొండ, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో పీజీ సెంటర్లు ఏర్పాటు చేయాలని, ఫీజు రీయంబర్స్‌మెంట్ వెంటనే విడదలు చేయాలని కోరుతూ ఈనెల 28 నుంచి 29 వరకు మండలాల్లో ధర్నాలు, ఆగస్టు 1నుంచి 4 వరకు కలెక్టరేట్ వద్ద దీక్షలు, ఆగస్టు 5న చలో కలెక్టరేట్ పిలుపునివ్వడం జరిగింది అని చెప్పారు. అలాగే విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని, ఏదైతే పెండింగ్‌లో రూ.ఉన్న 6400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, అలాగే డిగ్రీలో మేజర్, మైనర్ ఆన్సర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్ విద్యార్థులకు ఫలితాలు విడుదలై నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించకపోవడం అన్యాయమని, వెంటనే డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, ఎఎన్ఎంల పోస్టులను భర్తీ చేయాలని, అలాగే ఖాళీగా ఉన్న సంక్షేమ హాస్టల్లో వార్డెన్లను, వర్కర్లను వెంటనే నియమించాలి, ధరలకు అనుగుణంగా మెస్‌ఛార్జీలు రూ.3000కు పెంచాలని డిమాండ్ చేశారు. బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. అలాగే తల్లికి వందనం, పూర్తి ఫీజు రీయంబర్స్మెంట్ అమలుపై స్పష్టత ఇవ్వాలి ఎస్సీ, బీసీ,పోస్టుమెట్రిక్ హాస్టల్లకు సొంత భవనాలు, గిరిజన పోస్ట్ మెట్రిక్ హాస్టల్లో అదనపు భవనాల నిర్మించాలని ఈ ధర్నాలో విద్యార్థులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రాజేష్, అభి, సుమంత్, విద్యార్థులు పాల్గొన్నారు

సీతానగరం : మండల కేంద్రంలో బాలురకు, బాలికలకు కళాశాల హాస్టల్ వేరేగా ఏర్పాటు చేయాలని, మిగిలిన విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కోశాధికారి కె.డేవిడ్ డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, వార్డెన్ల పోస్టులను భర్తీ చేయాలని, ఇతర విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు దిలీప్, కళాశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

విద్యార్థులకు అభ్యుదయ గీతాలు, దేశభక్తి గీతాలు నేర్పాలని ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుర్రం రమణ కోరారు. ప్రజానాట్యమండలి కళాకారుల పాటల శిక్షణ కళాకారులు బి.పరశురాం ఆధ్వర్యాన స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో రమణ మాట్లాడారు. విద్యార్థుల్లో, యువకుల్లో దేశభక్తి కొరబడుతున్న పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన అనేక మంది త్యాగాల ఫలితంగా స్వాతంత్రం వచ్చిందనే భావన, స్వాతంత్రోద్యమంలో ఎంతో మంది వీరులు ప్రాణత్యాగం వల్ల వచ్చిన స్వాతంత్ర్యం స్ఫూర్తిని కల్పించాలని కోరారు. ప్రజానాట్యమండలి పాటల శిక్షణను నిర్వహిస్తుందని, ఈ కార్యక్రమాలు ఆగస్టు ఒకటి నుంచి 15 వరకు జరగనున్న కార్యక్రమంలో ఉత్సాహవంతులైన విద్యార్థులు, యువకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మూఢనమ్మకాలు వల్ల ప్రజలు అనేకమంది నష్టపోతున్నారని వారికి శాస్త్రీయమైన అవగాహన కలిగించేలాకళారూపాల ద్వారా చైతన్యపర్చేందుకు ప్రజానాట్యమండలి కృషి చేస్తుందని అన్నారు. మన పూర్వీకులు చేసిన త్యాగాలను విద్యార్థిని విద్యార్థుల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు హిమరక రామారావు, జి.రాము, సిఐటియు జిల్లా నాయకులు జి.సన్యాసిరావు, సూరిబాబు పాల్గొన్నారు.

యూరియా కోసం క్యూకట్టిన రైతులు

ప్రజాశక్తి - వీరఘట్టం



క్యూలో నిల్చొన్న రైతులు

యూరియా కోసం రైతులు క్యూ కట్టారు. పంపిణీ జరిగినచోట ఎటువంటి అవాంఛనీయ ఘటన జరగకుండా ఉండేందుకు ముందస్తు చర్యలుగా పోలీస్ ఆధ్వర్యంలో సజావుగా యూరియా పంపిణీ చేసిశారు. ఈ మేరకు మండల వ్యవసాయాధికారి జక్కువ సౌజన్య మాట్లాడుతూ స్థానిక మార్కెట్ యార్డులోనే సోమవారం 20 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేసినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని నాలుగు రైతు సేవా కేంద్రాల పరిధిలో గల రైతులకు యూరియా పంపిణీ చేసినట్లు తెలిపారు.

ఆదివాసీ దినోత్సవానికి ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లను ముందుగా చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ప్రపంచ ఆదివాసీ దినోత్సవ నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా, ఐటిడిఎ స్థాయిలో ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. వేడుకల నిర్వహణకు అనువైన ప్రదేశాలను ముందుగా గుర్తించాలని, గిరిజన సంస్కృతి ప్రతిబింభించేలా వేడుకలు జరగాలని పేర్కొన్నారు. అలాగే గిరిజన సంప్రదాయ వస్తువులు, పనిముట్లు, ఇతర సామాగ్రిని ప్రదర్శించేలా ఒక మ్యూజియం, గిరిజన సంప్రదాయ దుస్తులతో ఫోటోలు తీసుకునేలా సెల్ఫీ పాయింట్ ను ఏర్పాటు చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ద్వారా గిరిజన లబ్ధిదారులకు భూపట్టాలు, ఉపకరణాలు, చెక్కులు పంపిణీ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఐటిడిఎ పిఒలు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, ఎపిఒ ఎ.మురళీధర్, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు ఎం.సుధా రాణి, కె.రామచంద్రరావు, డిఎఫ్ఒ జిఎపి ప్రసూన, జిల్లా వికలాంగుల సంక్షేమ అధికారి డి.సత్య నారాయణ, గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ అధికారి ఎ.మణిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జంట హత్యల కేసులో వ్యక్తికి యావజ్జీవ జైలు

ప్రజాశక్తి - మక్కువ

స్థానిక పోలీస్ స్టేషనులో 2018లో నమోదైన జంట హత్యల నేరం కేసులో నిందితుడు గిన్నిపల్లి సింహాద్రి (35)కి రెండో అదనపు జిల్లా కోర్ట్ జడ్జి ఎస్.దామోదరరావు యావజ్జీవ కఠిన కారాగార జైలు శిక్ష, రూ.1,000 /- జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించారు. ఎస్‌పి ఎస్ వి.మాధవ్ రెడ్డి తెలిపారు.

వివరాల్లోకి వెళ్తే మండలంలోని పాలికివలసకు చెందిన గిన్నిపల్లి సింహాద్రి అదే గ్రామస్తులైన ఒమ్మి సోములు (55), ఒమ్మి నారాయణమ్మ(50)ను భూ వివాదాల నెలకొంది. ఈ నేపథ్యంలో 2018 జూన్ 18న పొలంలో సోములు, నారాయణమ్మ మేకలను మేపుతుండగా నిందితుడు వారిపై దాడి చేసి, వారి తలలను కొట్టి, గొంతు కోసివేయడంతో అక్కడికక్కడే ఇరువురు మరణించారు. తన తల్లిదండ్రులు పొలంలో చనిపోయి ఉండడాన్ని చూసి, నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మృతుల కుమారుడు ఒమ్మి పైడిరాజు మక్కువ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై కె.కృష్ణ ప్రసాద్ కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి సాలూరు రూరల్ సిఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ ఈ కేసును దర్యాప్తు చేసి, నిందితుడ్ని అరెస్టు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో తగిన సాక్ష్యాధారాలతో 2018 డిసెంబర్ 5న అభియోగ పత్రం దాఖలు చేశారన్నారు..ఈ కేసులో ప్రాసిక్యూషను పూర్తి అయ్యేలా పోలీసువారు చర్యలు చేపట్టగా, విచారణలో నిందితుడిపై నేరారోపణలు రుజువు కావడంతో సదరు నిందితుడు కి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.1,000 జరిమానా, జరిమానా కట్టనిచో నెల సాధారణ జైలు శిక్ష విధిస్తూ రెండో అదనపు జిల్లా కోర్ట్ జడ్జి తీర్పు వెల్లడించారు.

అద్దెబస్సు యజమానులు మొండి వైఖరి వీడాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఆర్‌టిసి అద్దెబస్సు డ్రైవర్లకు వేతనాల పెంపులో యజమానులు మొండి వైఖరి విడనాడాలని సిఐటియు నాయకులు, ఆర్‌టిసి అద్దెబస్సు డ్రైవర్లసంఘం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలోని అద్దె బస్సు డ్రైవర్లకు 2019 నుంచి వేతనాలు పెంచలేదని, వేతనాలు పెంపు కోరుతూ ఇప్పటికే కలెక్టర్, ఎసిఎల్, ఆర్టీసీ అధికారులకు వినతి పత్రాలు సమర్పించామని, అయినప్పటికీ యాజమాన్యాలు జీతాలు పెంపునకు పూర్తిస్థాయిలో అంగీకరించకపోవడం నిరసన తెలిపారు. ఈ మేరకు సోమవారం జిల్లా రవాణా అధికారి, ఆర్‌టిసి డిపో మేనేజర్ సమక్షంలో సమస్యలపై, వేతన ఒప్పందంపై చర్చలు జరిపారు. అద్దె బస్సు యాజమాన్యం వేతనాలు పెంచేందుకు పాక్షికంగా కొంత అంగీకరించినప్పటికీ పూర్తి స్థాయిలో వేతన పెంపునకు అంగీకరించక పోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకు ధరలు పెరుగుతున్నప్పటికీ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగకపోవడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో డ్రైవరు రోజుకు 12 నుంచి 18 గంటలు విధులు నిర్వహిస్తున్నారని, అయినా పనికి తగిన వేతనం చెల్లించడం లేదని అన్నారు. కార్మిక చట్టాలన్నింటినీ అమలు చేస్తామని, యాజమాన్యాలు ఆర్‌టిసి అధికారులతో ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ ఆ ఒప్పందాన్ని అమలు చేయడంలో అద్దె బస్సు యాజమానులు విఫలమవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా వేతన సవరణ

డ్రైవర్ల వేతనాలు పెంచాలి : సిఐటియు

చేయాలని, లేనిచో సమ్మె చేయడానికి వెనుకాడమని హెచ్చరించారు. చర్చల్లో ఆర్‌టిసి అధికారులతో పాటు జిల్లా కార్యదర్శి బివి రమణ, ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, కోశాధికారి గొర్లి వెంకటరమణ, బంకురు సూరిబాబు, అద్దె బస్సు డ్రైవర్ల సంఘం నాయకులు వీరాచారి, దుర్గాప్రసాద్, మన్మధరావులి తదితరులు పాల్గొన్నారు.



డిపో వద్ద ధర్నా చేస్తున్న అద్దెబస్సు డ్రైవర్లు, సిఐటియు నాయకులు

టేకు కలప స్వాధీనం

సీజైన కలప అగ్రిగోల్డ్ తోటలోదా? రైతులదా?

ప్రజాశక్తి - కొమరాడ

ఎటువంటి అనుమతుల్లేకుండా రాత్రి సమయంలో తరలిస్తున్న టేకు కలపను స్థానిక తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సోమవారం రాత్రి మండలంలోని చోళ పదం నుంచి కొమరాడ వైపు రెండు నాటు బండ్లపై వస్తున్న కలపను ముందస్తు సమాచారంతో స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద కలపను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. గతం నుంచి అగ్రిగోల్డ్ భూములు ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న విషయం తెలిసినప్పటికీ అక్కడ నుంచి కొంతమంది అక్రమార్కులు రాత్రిపూట నాటు బళ్లు, ట్రాక్టర్ల సాయంతో కలపను తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో స్థానికుల సమాచారంతో రెవెన్యూ అధికారులు స్పందించి ఈ బళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అనంతరం రెండు టేకు నాటు బండ్లను స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించి పోలీసులు అదుపులో ఉంచామని తెలిపారు. అయితే గత కొన్నేళ్లుగా విలువైన అగ్రిగోల్డ్ భూముల్లో ఉన్న టేకు కలపను కొంతమంది కలప వ్యాపారులు నిత్యం అక్రమంగా రవాణా చేస్తున్నా ఇంత వరకూ ఎవరికీ పట్టు పడకపోవడం విశేషం. అయితే ఇప్పుడు పట్టుకున్న కలప అగ్రిగోల్డ్ సీజైన టేక్ తోటలోనివేనని కొంతమంది స్థానికులు ఆరోపణ వినిపిస్తున్నా, బళ్లపై తరలిస్తున్న వారు మాత్రం రైతుకు చెందిన కలపగా వారు చెప్తున్నారు. ఈ విషయంపై మంగళవారం తహశీల్దారు దర్యాప్తు చేసి వివరాలు వెల్లడిస్తామని మీడియాకు తెలిపారు.



నానో విక్రయ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

నానో యూరియాతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - పార్వతీపురం

యూరియా, డిఎపికి బదులుగా కొత్తగా సాంకేతిక పరిజ్ఞానం కలిగిన నానో యూరియా, నానో డిఎపిని వాడాలని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ రైతులకు సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో నానో యూరియా, నానో డిఏపీ విక్రయిస్తున్న కౌంటరును కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానో టెక్నాలజీతో తయారైన యూరియా, డిఏపీని వాడటం వలన రైతులకు ఆర్థిక భారం తగ్గి, మొక్కకు కావలసిన పోషకాలు లభిస్తాయని తెలిపారు. అంతేకాకుండా వరిలో రైతుకు అధిక దిగుబడి లభిస్తుందని, తద్వారా అధిక ఆదాయం లభించనుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.రాబర్ట్ పాల్, కోరమాండల్ వారి మన గ్రోమోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

నాణ్యమైన భోజనం అందించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలిక ఉన్నత పాఠశాలలో మంచిగా విద్యా బోధలు అందిస్తూ సరైన భోజనం అందించాలని ఎంపిడిఒ, ఉలిపిరి ఆశ్రమ పాఠశాల నోడల్ అధికారి ఎస్ రమేష్ అన్నారు. సోమవారంఉలిపిరి ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. పరిశీలన సమయంలో 346 మంది పిల్లలకు 301 మంది పాఠశాలలో ఉన్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ సిబ్బంది 17 మందికి 13 మంది, సి ఆర్ టి లు 4 ఉన్నట్లు తెలిపారు. పదో తరగతి విద్యార్థినులతో తెలుగు పాఠ్యాంశాలు పై కొన్ని సమాధానములు అడగ్గా వారిలో కొంతమంది సమాధానాలు సరైనవి కాకపోవడంతో క్లాస్ టీచర్‌కు వారిపై శ్రద్ధ వహించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించారు. స్టాక్ రూమ్ రికార్డులను పరిశీలించారు. ఆశ్రమ పఠశాలలో విద్యార్థులు కందుతున్న వసతులపై ఆరా తీశారు. అనంతరం ఏవైనా విద్యార్థులకు ఇబ్బందులు ఉన్నాయా అనివిద్యార్థులతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో ప్రధానోపాధ్యాయులు రామ గోవింద ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కురుపాం

ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో ఆదివాసీలంతా పాల్గొని జయప్రదం చేయాలని నీలకంఠాపురం, మొండెంఖల్ సర్పంచులు ఎ.మన్మధరావు, ఐ.గౌరీ శంకర్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని నీలకంఠాపురం సచివాలయం వద్ద టిఆర్ఎప్ జిల్లా అధ్యక్షులు ఐ.రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివాసీ నాయకులతో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజనుల హక్కుల కోసం ఉన్నటువంటి చట్టాలను, 1/70 జీవోను కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలు పగడ్బందీగా అమలు చేసేలా చర్యలు చేపట్టడానికి గిరిజనులంతా ఆదివాసీ దినోత్సవం వేదికగా ఏకతాటిపై వచ్చి ఆదివాసీల హక్కులు, చట్టాలపై ప్రభుత్వాలకు తెలియజేసేలా గిరిజన యువత, మహిళలు యావత్ గిరిజన ప్రజానీకం పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి అన్నాజీరావు , మాజీ ఎంపిపి నీలకంఠేశ్వరరావు, ఎంపిటిసి రాజేశ్వరి, గిరిజన యువత ప్రజలు పాల్గొన్నారు.



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ జగన్మోహనరావు

ఆరోగ్యంపై పర్యవేక్షణ ఉండాలి

ప్రజాశక్తి - సీతానగరం

గ్రామాల్లో ప్రజలు రోగాల బారిన పడకుండా అందుకు కారణమైన వాటిపై సమష్టి కృషితో నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్.సి.డి ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. గత కొద్దిరోజులుగా గ్రామంలో పలువురికి అనారోగ్య లక్షణాలు చోటు చేసుకున్న నేపథ్యంలో ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితులు, అందుతున్న వైద్య సేవలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. రోజువారీ ఓపి వివరాలు పరిశీలించగా కీళ్ళు, కండరాల నొప్పులతో కొద్దిగా జ్వర లక్షణాలు నమోదు అయ్యాయన్నారు. ఇప్పటికే గ్రామంలో డిఎంహెచ్ఒ సందర్శించి వైద్యాధికారి, వైద్య సిబ్బందికి తగు సూచనలు చేశారన్నారు. ప్రస్తుతం చాలావరకు తగ్గుముఖం పడ్డాయన్నారు. వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే అందుకు ప్రధాన కారణమైన పారిశుధ్యం, నీటి నిల్వలు, అపరిశుభ్ర పరిసరాలపై దృష్టి కేంద్రీకరించాలని, సంబంధిత శాఖలు సమన్వయంతో నివారణ చర్యలు చేపట్టాలన్నారు.కార్యక్రమంలో వైద్య సిబ్బంది హరిప్రియ, లక్ష్మీ ఉన్నారు.

అధిక ధరలకు ఎరువులు అమ్మితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - కురుపాం

ఎరువులు ధరలకు అమ్మితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ కె.జయ అన్నారు. కురుపాంలో గల ఎరువుల దుకాణాలను సోమవారం ఆమె ఆకస్మికంగా సందర్శించి నిల్వ ఉన్న ఎరువులను, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు దుకాణాలను సందర్శించి పరిశీలిస్తున్నట్టు తెలిపారు. ఎరువులు ఉండీ లేవని చెప్పి రైతులను మోసగించి అధిక ధరలకు అమ్మితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఒ కె.నాగేశ్వరరావు, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొండ దిగినప్పుడు సెల్ఫ్ ఆఫ్ చేయొద్దు

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట పిఎంఆర్‌సి జంక్షన్ సంత మార్కెట్ సమీపంలో సోమవారం పోలీసుల ఆధ్వర్యంలో ప్రమాదాలు నివారణపై ఎస్సై వై.అమ్మనరావు ఆటో డ్రైవర్లకు, యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆడలి యు పాయింట్, కొండలపై నుంచి దిగినప్పుడు ఆటోలు, ద్విచక్ర వాహనాలు న్యూట్రల్లో, సెల్ఫ్ ఆఫ్ చేసి రావద్దని, ఇంజిన్ ఆన్ చేసి గేర్‌లో రావాలని సూచించారు. దీంతో ప్రమాదాలను నివారించవచ్చునని చెప్పారు. ఆడలి యు పాయింట్ వెళ్తే తప్పనిసరిగా హెల్మెట్ ఉండాలని లేకపోతే నో ఎంట్రీని చెప్పారు. మితిమీరి ప్రయాణికులు ఎక్కించకూడదని అన్నారు.



వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అమ్మన్నరావు

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం : మంత్రి

ప్రజాశక్తి - పాచిపెంట

అభివద్ధి సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్రంలో పాలన కొనసాగుతుందని గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. పాచిపెంటలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ ఒక్క పాచిపెంటలోనే 1035 మంది పింఛన్లు, 1120 మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకాలు అందజేశామన్నారు. ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. అలాగే మండలంలో పూడి నుండి పనుకువలసకు మూడు కోట్లతో బిటి రోడ్డు, సరాయి వలస ఆశ్రమ పాఠశాల అభివద్ధికి రూ.4.76కోట్లు మంజూరైట్లు తెలిపారు. పాచిపెంట పిహెచ్‌సిని సిహెచ్‌సిగా మార్చేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మోదుగ పంచాయతీకి చెందిన 50 కుటుంబాలు మంత్రి సమక్షంలో టిడిపిలో చేరాయి. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు గూడెపు యుగంధర్, ఎఎంసి చైర్మన్ ముఖీ సూర్యనారాయణ, చల్ల కనకబాబు, పల్లేడ ఉమామహేశ్వరరావు, వెంకటరమణ, పూసర్ల నర్సింగరావు, మతల బలరాం, కొత్తల పోలి నాయుడు, నడిపల్లి మెహర్‌బాబా, తహశీల్దార్ డి.రవి, ఎంపిడిఒ బివిజె పాత్రో తదితర నాయకులు, కార్యకర్తలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని దిగువమండ, మల్లుగూడ, ఎగువమండ గ్రామాల్లో మండల టిడిపి అధ్యక్షులు అడ్డాకుల నరేష్ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఇంటింటికి తిరిగి సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలు పంచుతూ ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన అభివద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్ పర్సన్ కడ్రక కళావతి, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు, సర్పంచ్ హైమావతి, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు మండంగి భూషణరావు, నియోజకవర్గ మహిళా కార్యదర్శి వెంపటాపు భారతి, కిల్లక శాంతకుమార్, కడ్రక అప్పలస్వామి, తాడంగి రామారావు, డుమ్మంగి సర్పంచ్ పాలక క్రాంతి కుమార్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇది ప్రభుత్వ కార్యక్రమమా? పార్టీదా?

ప్రజాశక్తి - సాలూరు

పాచి పెంట సోమవారం మంత్రి సంధ్యారాణి సుపరిపాలన లో తొలి అడుగు, ఇంటింటికీ టిడిపి కార్యక్రమం నిర్వహించారు. ఇంతవరకు జరిగిన కార్యక్రమాల్లో కేవలం టిడిపి నాయకులు కార్యకర్తలు మాత్రమే పాల్గొన్నారు. కానీ అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్న దాఖలాల్లేవు. అయితే పాచిపెంటలో నిర్వహించిన కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొనడం వివాదాస్పద మవుతోంది. ఎంపిడిఒ పాత్రో, తహశీల్దార్ రవి, సిడిపిఒ అనంతలక్ష్మితో పాటు వెలుగు, వైద్య శాఖ, ఉపాధి హామీ అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు .నిర్వహించిన సభలోనూ కొంతమంది అధికారులు మాట్లాడారు. సభకు పెద్ద సంఖ్యలో అంగన్వాడీ కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు హాజరయ్యారు. వెలుగు అధికారులు డ్వాక్రా మహిళలను మభ్యపెట్టి రప్పించి నట్లు తెలుస్తోంది.గ్రామంలో జరిగిన ర్యాలీలో నూ వీరంతా పాల్గొన్నారు.అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు హాజరు కావాలని ఎక్కడా ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు జారీ కాలేదు.కానీ ఎక్కడా లేని విధంగా ఇక్కడ జరిగిన పార్టీ కార్యక్రమంలో మండల అధికారులు మొత్తం హాజరు కావడం వివాదాస్పద మవుతోంది.గ్రామంలో జరిగిన కార్యక్రమానికి గిరిజన గ్రామాలనుండి అధిక సంఖ్యలో ప్రజలను వెలుగు అధికారులు రప్పించారనే వాదనలు వినిపిస్తున్నాయి.పార్టీ కార్యక్రమాన్ని ప్రభుత్వ కార్యక్రమం లా నిర్వహించడం పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వైద్య శిబిరాన్ని సందర్శించిన డిఐఒ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లక్ష్మీపురంలో ఉచిత ఉచిత వైద్య శిబిరాన్ని డిఐఒ డి జగన్మోహన్‌రావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు తనిఖీలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా వచ్చే వారికి అన్ని పరీక్షలు నిర్వహించి మందులను సరఫరా చేసి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి హరిప్రియ, ఎఎన్ఎం లక్ష్మి, ఆశా కార్యకర్త పి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - సీతానగరం

కుట్టు మిషన్ల శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం బ్యాచ్‌ల వారీగా 90 రోజుల పాటు కుట్టు శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మొదటివిడత 67 మందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ ఉన్నారు.



గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

తాగునీటి కల్పనే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణ పరిధిలోని ప్రతి ఇంటికి తాగునీటి సదుపాయం కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే బోనాల విజయ్ చంద్ర అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న గ్రీవెన్స్‌ను ఆయన పరిశీలించారు. సమస్యల పరిష్కారానికి వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిశీలించేందుకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. అనంతరం మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి తోటపల్లి జలాశయం వద్ద ఉన్న ఇన్ ఫిల్టరేషన్ బావులను, పంప్ హౌస్ మోటార్ల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటికి రక్షిత మంచినీటి సరఫరా అందించేందుకు రూ. 86 కోట్ల 14 లక్షలతో అర్బన్ ఇన్ ఫ్రా స్ట్రక్చర్ డెవలప్మెంట్ ప్రాజెక్టు పనులు త్వరలోనే ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఈ పనులు పూర్తయిన వెంటనే తాగునీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, డిఇ శ్రీనివాసరాజు, ఎఇ అప్పారావు, మాజీ వైస్ చైర్మన్ బెలగాం జయ ప్రకాష్ నారాయణ, పట్టణ టిడిపి అధ్యక్షులు గుంట్రెడ్డి రవికుమార్, కౌన్సిలర్లు కోరాడ నారాయణరావు, మంత్రి రవికుమార్, మజ్జి చంటి, రణభేరి చిన్నం నాయుడు, బొత్స ఆనంద్, నాయకులు కోలా మధుసూధనరావు, మజ్జి వెంకటేష్, వలిరెడ్డి జగదీష్, రామరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలని వినతి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో 8 నెలలకు పైగా ఏనుగుల వల్ల నష్టపోయిన గిరిజన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు సోమవారం గిరిజనులు వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, జెసి ఎస్ఎస్ శోబిక అక్కడే ఉన్న అటవీశాఖ అధికారులను పిలిపించి విచారణ జరిపించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ కురుపాం మండలం జరడ, తిత్తిరి పంచాయతీల పరిధిలోని బొద్దామానుగూడ, గుమిడిమణుగూడ, గుండం, కొత్తగూడ, నీమలిమానుగూడలో 8 నెలలు క్రితం చీపుర్లు, వరి, పసుపు, మొక్కజొన్న, పత్తి, అరటి పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయని చెప్పారు. కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌కు వస్తున్న బాధిత గిరిజనులను అటవీ సిబ్బంది అడ్డుకున్నారని చెప్పారు. అటవీ, రెవిన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టాలను పరిశీలించి దరఖాస్తులు తీసుకున్నారని, అయితే 8నెలలైనా ఇంతవరకు పరిహారం చెల్లించలేదని చెప్పారు. వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

మంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజనశాఖా మంత్రి గుమ్మడి సంధ్యా రాణి ఇచ్చిన మాట, పెట్టిన మొదటి సంతకం మేరకు తక్షణమే గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో, వసతి గృహల్లో గతంలో పనిచేసిన "ఆదివాసీ ఆరోగ్యం "వైద్య సిబ్బందిని విధుల్లోకి తీసుకుని గిరిజన విద్యార్థుల ప్రాణాలు కాపాడాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఏడో రోజు నిరసనలో భాగంగా కలెక్టరేట్ ఎదుట ఒంటి కాలిపై నిలబడి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల ప్రాణాలు పోతున్నా పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన విద్యార్థుల మరణాల సంఖ్య పెరగక ముందే వైద్య సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పల్ల సురేష్, చెల్లూరి సీతారాం, జట్ల బంగార్రాజు, కాంగ్రెస్ నాయకులు తీళ్ళ గౌరిశంకరావు, న్యాయవాది వెంకటరమణ, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు తాడంగి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

సిఐటియు అఖిలభారత, జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ పిలుపునిచ్చారు. మండలంలోని ఉల్లిభద్రలో సోమవారం జరిగిన సిఐటియు మండల సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో కార్మిక వర్గం అనేక సమస్యలు ఎదుర్కొంటుందని, ఈ సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. కార్పొరేట్లకు మేలు చేసేందుకు కార్మికుల హక్కులను హరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూను కుంటున్నాయని, ఈ విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో సిఐటియు అగ్ర భాగాన నిలిచిందని తెలిపారు. దేశంలో వివిధ రంగాల కార్మికులను, సంఘాలను ఐక్యం చేసి బలమైన కార్మిక వర్గ పోరాటాలను నిర్మించేందుకు డిసెంబర్ 31, జనవరి 1 నుండి 4 వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలు దోహదపడతాయని తెలిపారు. ఈ మహాసభలకు ముందుగా రాష్ట్ర, జిల్లా మహాసభలు నిర్వహించనున్నామని అందులో భాగంగా పాలకొండలో జిల్లా మహాసభలు సెప్టెంబరు 13, 14 వ తేదీలల్లో జరుగుతాయని ఈ మహాసభలను జిల్లాలోని కార్మికవర్గం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు అనుబంధ సంఘాల నాయకులు సిహెచ్ గౌరమ్మ, సావిత్రి, గంగాభవాని, లావణ్య, నీలిమ కల్పన,జాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్య అందించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక చింతలగూడ వీధిలోని ఎయిడెడ్ పాఠశాలను సర్పంచ్ బి.గౌరీశంకర్ రావు సోమవారం సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పిల్లలకు గుణాత్మక విద్య అందించడమే మన లక్ష్యం అన్నారు. పాఠశాల దశలో పిల్లల అభివృద్ధికి భోజనం, ఆరోగ్యం, బోధన సమాంతరంగా సాగాలన్నారు. విద్య అనేది కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, విలువలు నేర్పే యాత్రగా ఉండాలని పేర్కొన్నారు. హెచ్ఎం బేత కుమారస్వామి ఉన్నారు.

మరుగుదొడ్లు పూర్తి చేయాలని వినతి

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ వీధిలో అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్ల పనులు పూర్తి చేసి వినియోగంలోనికి తీసుకురావాలని రెల్లి వీధి వాసులు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ వెంకటరమణకు ఫిర్యాదు చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత టిడిపి హయాంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో సుమారు రూ.8 లక్షల అంచనాతో మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేపట్టారని, దాదాపు పదేళ్లు కావస్తున్నా పనులు పూర్తికాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో కాల కృత్యాల కోసం ప్రజలు ఆరు బయటకు పరుగులు తీస్తున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే మరుగుదొడ్లు పూర్తి చేయాలని కోరారు.

సోలార్ లైటింగ్ ఏర్పాటు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రమైన వీరఘట్టంలో సోమవారం సోలార్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు మేజర్ పంచాయతీ ఇఒ బి.కోటేశ్వరరావు తెలిపారు. పోలీస్ స్టేషన్ నుండి ప్రధాన రహదారి మీదుగా పెట్రోల్ బంక్ వరకు ఒకవైపు సోలార్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సుమారు 90 సోలార్ లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీలో మలేరియా డయేరియా వైరల్ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉన్నామని డిప్యూటీ డిఎంహెచ్ కె విజయపార్వతి, జిల్లా మలేరియా అధికారి పివి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఏజెన్సీలో మలేరియా మరణాలు లేవని చెప్పారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధులు రాకుండా యాంటీ లార్వా ఆపరేషన్ చేయించామని తెలిపారు. 212 గిరిజన గ్రామాలకు 140 గ్రామాల్లో ఐఆర్ఎస్ ద్రావణం పిచికారీ చేయించామని తెలిపారు. పాఠశాలలో గిరిజన గ్రామాల్లో స్ప్రేయింగ్ ఇంటి లోపల, బయట చేయించామని ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందుగానే వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశామని తెలిపారు. జ్వరాలు వచ్చిన వెంటనే వైద్య శిబిరాలు నిర్వహించి స్క్రీనింగ్ టెస్ట్ చేస్తున్నామని, వెంటనే ఏరియా ఆసుపత్రికి తరలిస్తున్నామని తెలిపారు. మందులు కొరత లేదన్నారు. వీరితోపాటు జిల్లా మలేరియా కన్సల్టెంట్ శ్రీకాంత్ ఉన్నారు

పి-4పై సమీక్ష

ప్రజాశక్తి - సీతానగరం

పేదరికం లేని సమాజమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిడిఒ మండల పరిషత్ అభివద్ధి అధికారి ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. మండలంలోని లచ్చయ్యపేట సచివాలయంలో పి-4 కార్యాచరణపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ పేదరికం పూర్తిగా తొలగించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. మార్గదర్శకుల సహాయ సహకారాలతో బంగారు కుటుంబాలను పైకి తీసుకురావడానికి కార్యాచరణ ప్రణాళికలు తయారు చేస్తునట్టు తెలిపారు. ఆర్థికంగానే కాకుండా విద్య, వైద్యం, తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి బంగారు కుటుంబాలకు తోడ్పాటు అందించేందుకు మార్గదర్శులు తోడ్పాటు అందిస్తారని వెల్లడించారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి కెకె వర్మ, ఆయా గ్రామాల కార్యదర్శులు పి.సంతోష్ కుమార్‌తో పాటు పలువురు నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు భారం పెట్టొద్దు

గుమ్మలక్ష్మీపురం : పి 4 విధానంతో ఉద్యోగలకు భారం పెట్టొద్దని ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి మండంగి సన్యాసిరావు అన్నారు. మండలంలోని లుంబేసు గ్రామ సచివాలయంలో పి-4 గ్రామసభ నిర్వహించారు. గ్రామసభ జరిగిన సందర్భంలో సన్యాసిరావు మాట్లాడుతూ పి-4 విధానం పేరుతో ఉద్యోగస్తులకు భారం పెట్టొద్దన్నారు. గిరిజన గ్రామాలకు ఉద్యోగస్తులు దత్తత తీసుకోవడం సరైంది కాదన్నారు. ప్రభుత్వమే బాధ్యత తీసుకొని అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలన్నారు. ఏజెన్సీ ప్రాంతం కావడంతో నెట్వర్క్ సమస్య ఎక్కువగా ఉందన్నారు. యాప్‌ల భారం లేకుండా చూడాలన్నారు.

యాంటీ లార్వా ఆపరేషన్ పరిశీలన

ప్రజాశక్తి - సీతంపేట

యాంటీ లార్వా ఆపరేషన్ కార్యక్రమాన్ని హడ్డుబంగి పంచాయతీ మర్రిపాడు పిహెచ్‌సి పరిధిలో ఉన్న పనసగూడలో ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమం గురించి పూర్తిగా అడిగి తెలుసుకున్నారు. ఈ యాంటీ లార్వా ఆపరేషన్‌లో డ్రైఫ్లూ బెంజిరాన్ అనే రసాయనాన్ని ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి పివి సత్యనారాయణ, శ్రీకాకుళం మలేరియా కన్సల్టెంట్ శ్రీకాంత్, సబ్ యూనిట్ ఆఫీసర్ మోహన్‌రావు, మలేరియా టెక్నికల్ సూపర్వైజర్ ఝాన్సీ, పంచాయతీ కార్యదర్శి, ఎఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

ప్రజాశక్తి - కొమరాడ

మావోయిస్టు తలపెడుతున్న వారోత్సవాల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై కె.నీలకంఠం అన్నారు. సోమవారం సరిహద్దు ప్రాంతమైన కొమరాడ పోలీస్ స్టేషన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒడిస్సా నుంచి ఆంధ్రాలోకి వస్తున్న వాహనాలను, అలాగే సంతల నుంచి పలువురు తీసుకెళ్తున్న సామాగ్రిని పూర్తిస్థాయిలో పరిశీలిస్తున్నట్టు తెలిపారు. గ్రామాల్లో అనుమానత వ్యక్తులు సంచరించినట్లయితే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. 24 గంటలు సరిహద్దు ప్రాంతంలో చెక్పోస్ట్ వద్ద ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు వితరణ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గుజ్జుపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థులకు ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ పుస్తకాలు, పెన్నులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల చదువుకు ఎంతో కొంత తనవంతుగా చేయూతను అందజేయాలనే లక్ష్యంతో 55 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని చర్యలకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

గణనీయంగా పెరిగిన అడ్మిషన్లు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్రవేశాలు గణనీయంగా పెరిగినట్లు ప్రిన్సిపల్ వేమూరి హరగోపాల్ తెలిపారు సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం 243 మంది చేరగా, ఈ ఏడాది 275 మంది విద్యార్థులు ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో చేరినట్టు తెలిపారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం, ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాలు అందజేయడం, ప్రతి విద్యార్థి పట్ల మెరుగైన శ్రద్ధ తీసుకోవడం తదితర కారణాలతో అడ్మిషన్ సంఖ్య పెరిగిందన్నారు.

ఎంపిడిఒగా నాగభూషణరావు

ప్రజాశక్తి - కురుపాం



స్థానిక మండల అభివృద్ధి అధికారిగా బివి నాగభూషణరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో ఎఒగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి సామర్లకోట శిక్షణ నిమిత్తం వెళ్లడంతో నెల రోజుల పాటు తాను ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించానని తెలిపారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కురుపాం ఎస్ఐ నారాయణరావు

విద్యార్థి దశ నుండే ఉత్తమ లక్షణాలను అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

విద్యార్థి దశ నుంచే ఉత్తమ లక్షణాలను అలవర్చుకోవాలని ఎస్ఐ పి.నారాయణరావు అన్నారు. సోమవారం స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, యాంటీ డ్రగ్స్, రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వ్యసనాలకు బానిస కాకుండా సక్రమంగా చదువుకొని ఉన్నత స్థానంలో స్థిరపడాలంటే విద్యార్థి దశ నుంచే కఠోర శ్రమతో కష్టపడి చదివి మంచి లక్షణాలను అలవర్చుకొని ఉన్నత స్థానంలో స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సత్యనారాయణ, పాఠశాల, పోలీస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

సీతానగరం: ఆడపిల్లలకు యాప్‌లపై అవగాహన కల్పించాలని ఎఎస్ఐ లంక శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని బాలికలకు వివిధ యాప్‌లపై అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ ర్యాగింగ్, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతి బాలిక తన మొబైల్‌లో యాప్‌లను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పద్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇ.ప్రసన్న లక్ష్మి, కళాశాల ప్రిన్సిపల్ ఎల్.దాలినాయుడు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటి వద్ద స్ప్రేయింగ్ తప్పనిసరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మలేరియా దోమ కాటు నుంచి రక్షణ పొందేందుకు ప్రతి ఇంటి వద్ద, అన్ని గదుల్లో మలేరియా మందు పిచికారీ చేయించుకోవాలని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ అన్నారు. మండలంలోని రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల కానసింగిలో జరుగుతున్న స్ప్రేయింగ్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ప్రజలు స్ప్రేయింగ్ చేయించుకోవడంతో పాటు తమ ఇంటి పరిసరాలను, నీటి నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. స్ప్రేయింగ్‌లో చొరవ చూపిన ఎంఎల్‌హెచ్‌పి చింతల్లిని అభినందించారు. అనంతరం రేగిడి పిహెచ్‌సిని సందర్శించి మలేరియా పాజిటివ్ కేసుల స్థితి గతులను వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. మలేరియా మందుల నిల్వలను గురించి ఎల్‌టి రామును ఆరా తీశారు. మలేరియా వచ్చిన ప్రతి కేసుకు పూర్తి చికిత్స జరగాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా కన్సల్టెంట్ రామచంద్రరావు, సూపర్‌వైజర్ రమణ, సబ్ యూనిట్ ఆఫీసర్ రాధాకృష్ణ, స్థానిక ఎఎన్ఎం, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.